# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-12-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు "క్వాంటం టాక్" కార్యక్రమంలో పాల్గొననున్నారు.**

2. **ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవా మార్గాలను సూచించింది క్రీస్తు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.**

4. **'ముస్తాబు' కార్యక్రమ నిర్వహణతో విద్యార్థుల్లో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు.**

5. **రాష్ట్రంలో యూరియా విక్రయాలు పారదర్శకంగా జరగాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం మొబైల్ యాప్‌ను తెచ్చిందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు "క్వాంటం టాక్" కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ ఉదయం టెక్ విద్యార్థులతో ఆన్ లైన్ లో ఆయన మాట్లాడనున్నారు. దేశంలోనే తొలిసారి అతి పెద్ద క్వాంటం విద్యా సదస్సు ద్వారా విద్యార్థుల్లో నైపుణ్య కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వేలాదిగా విద్యార్థులు, ఐటీ రంగ ఉద్యోగులు రిజిస్టర్ చేసుకున్నట్లు వెల్లడించారు. క్వాంటం టెక్నాలజీ లక్ష్యాల గురించి సదస్సులో ముఖ్యమంత్రి వివరించనున్నారని పేర్కొన్నారు.

--------------------------

ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవా మార్గాలను సూచించింది క్రీస్తు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు క్రైస్తవులకు సంక్షేమం, ఆర్థిక చేయూత అందించింది కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిన్న నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వడం తొలత ప్రారంభించింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. సమైఖ్య రాష్ట్రంలో క్రిస్మస్ వేడుకలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించింది తానేనని

పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

-----------------------------

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌లో శీతాకాల విడిది ముగించుకుని నిన్న సాయంత్రం ప్రత్యేక విమానంలో దిల్లీకి వెళ్లారు. అంతకుముందు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట వైమానిక దళ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క తదితరులు, త్రివిధ దళాల అధికారులు విమానాశ్రయంలో రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు. శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 17న ద్రౌపది ముర్ము నగరానికి వచ్చారు.

-----------------------------

పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రణాళికలను రూపొందించాలని ఆయన పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో పర్యాటక అభివృద్ధి, ఉపాధి కల్పనపై సమీక్షను ఆయన నిన్న నిర్వహించారు. రాష్ట్రం అన్ని విధాలా సురక్షితమన్న భావన పర్యాటకుల్లో కలగాలని చెప్పారు. ఇందుకోసం టూరిజం సేఫ్టీ అండ్ ప్రొటెక్షన్ పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

-----------------------------

'ముస్తాబు' కార్యక్రమ నిర్వహణతో విద్యార్థుల్లో ఆరోగ్యం మెరుగుపడుతుందని, క్రమశిక్షణ అలవడడంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కృష్ణా జిల్లా మోపిదేవిలోని గురుకుల పాఠశాలలో ముస్తాబు కార్యక్రమం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముస్తాబు కార్నర్ ను ప్రారంభించిన అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

రాష్ట్రంలో యూరియా విక్రయాలు పారదర్శకంగా జరగాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం మొబైల్ యాప్‌ను తీసుకువచ్చిందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. రైతులు షాపుల వద్ద క్యూలైన్లలో ఉండి వారి సమయాన్ని వృధా చేసుకోకుండా ఉండేందుకు యాప్ ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలోని రైతులైనా వారికి దగ్గర్లోని షాప్‌లోనే యూరియా కొనుగోలు చేసే సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

-----------------------------

భారత మాజీ ప్రధానమంత్రి చౌదరీ చరణ్ సింగ్ జయంతిని ఈ రోజు జాతీయ రైతు దినోత్సవం లేదా కిసాన్ దివస్‌గా నిర్వహిస్తున్నారు. దేశ ప్రధానమంత్రిగా చరణ్ సింగ్ పనిచేసింది కొద్ది కాలమే అయినప్పటికీ... వ్యవసాయ రంగాభివృద్ధికి ఆయన విశేషకృషి చేశారు. అన్నదాత మేలు కోసం ఎన్నో వ్యవసాయ చట్టాలను అమలులోకి తీసుకువచ్చారు. 1902 డిసెంబర్ 23వ తేదీన జన్మించిన చరణ్ సింగ్... ప్రధానమంత్రిగా పనిచేసిన

సమయంలోనే జమిందారీ చట్టం రద్దయి.... కౌలుదారీ చట్టం అమలులోకి వచ్చింది. ఏడాదిలో ఒక్క రోజైనా వ్యవసాయ రంగంపై ప్రజలకు అవగాహన కల్పించడమే కిసాన్ దివస్ ను జరుపుకోవడంలోని ప్రధాన అంశం.

---------------------------

షెడ్యూల్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ - పెసా చట్టం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం వేదికగా ఈ రోజు, రేపు పెసా మహోత్సవ్ ను నిర్వహించనున్నట్లు కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్ వెల్లడించారు. విశాఖపట్నంలో శేఖర్ నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ వేడుకలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారని తెలిపారు. కార్యక్రమానికి పది రాష్ట్రాల నుంచి పంచాయతీల ప్రతినిధులు, క్రీడాకారులు, సాంస్కృతిక కళాకారులు విచ్చేస్తున్నారని వెల్లడించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

భారత్ లో శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు పర్యటనలో భాగంగా 2వ టి 20 మ్యాచ్ ఈ రోజు విశాఖపట్నంలోని ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరుగనుంది. రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. 21న జరిగిన మొదటి మ్యాచ్ లో భారత్ జట్టు విజయం సీరీస్‌లో సాధించి 1-0 ఆధిక్యంతో నిలిచింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలోని దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తాల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారిణి జి. లక్ష్మి పేర్కొంటూ..

వాయిస్..20 సెకన్లు

మరోవైపు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. ఏజన్సీ, ఇతర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల నుంచి 15 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడివాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అక్కడక్కడా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. అదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా శీతల గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

====================